క్లుప్తంగా

'ఇష్టారీతిన విమర్శలు సరికాదు'

భైంసాటౌన్: ముధోల్ బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్‌పై బీఆర్‌ఎస్ నాయకురాలు పి.రమాదేవి ఇష్టానుసారం విమర్శలు చేయడం మానుకోవాలని బీజేపీ మహిళా మోర్చా నాయకులు పేర్కొన్నారు. గురువారం భైంసాలోని బీజేపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా లోకేశ్వరం మండల అధ్యక్షురాలు అనసూయ మాట్లాడుతూ సర్వేలో రామారావుపటేల్‌కు గెలుపు అవకాశాలు ఉన్నందునే పార్టీ ఆయనకు టికెట్ కేటాయించిందన్నారు. మరి రమాదేవి ఎన్ని రూ.కోట్లు తీసుకుని బీఆర్‌ఎస్‌లో చేరారని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇలాంటి విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం



రైతును సన్మానిస్తున్న అధికారులు

కుభీర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ పత్తి కొనుగోళ్లను ప్రారంభించింది. గురువారం పత్తి క్వింటాల్‌కు ధర రూ.7,020 పలికింది. పత్తి విక్రయానికి తీసుకొచ్చే రైతులు తప్పనిసరిగా పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వాక్ హైమద్, సీపీవో వెంకటేశ్, మార్కెట్ కార్యదర్శి గంగాధర్ తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్‌కే వైఎస్సార్‌టీపీ మద్దతు'



మాట్లాడుతున్న ముత్యంరెడ్డి

ముధోల్: కాంగ్రెస్‌కే వైఎస్సార్‌టీపీ మద్దతు ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బెజ్జంకి ముత్యంరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు తాము ముధోల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నారాయణ్‌రావుపాటిల్‌కు మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని.. బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. వారి వెంట నాయకులు ఇమ్రాన్, మల్లయ్య, జాబీర్ హైమద్ ఉన్నారు.

పోలీసుల కవాతు



కవాతులో పాల్గొన్న పోలీసులు

లోకేశ్వరం: ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా ప్రజలు సహకరించాలని లోకేశ్వరం ఎస్సై సాయికుమార్ అన్నారు. గురువారం మండలంలోని మన్మద్, రాజూర గ్రామాల్లోని వీధుల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం వాహనాల తనిఖీ చేపట్టారు. వారి వెంట పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'ఓపెన్ విద్య'లో ప్రవేశాలు

కుంటాల: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరేవారు ఈనెల16 నుంచి 30వరకు ప్రవేశం పొందాలని కుంటాల ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ వాటోలి ముత్యం, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సగ్గం గంగాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 85558 38196 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని పోట్‌పల్లి గ్రామంలో ధర్మపురి సతీమణి గోసుకుల రాజమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం బాధిత కుటుంబసభ్యులను మున్నూరు కాపు సంఘం తాలుక అధ్యక్షుడు రోర్ల రమేశ్ పరామర్శించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం మండలాధ్యక్షుడు మంద లింగన్న, కుంటాల భోజన్న, చిన్నయ్య, భోజన్న తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిక

సోన్: మండల కేంద్రంతోపాటు బొప్పారం గ్రామ యువకులు పలువురు గురువారం బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. వీరికి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సోన్న సతీశ్, లోలం సాగర్, గోపి సంతోశ్, గంగయ్య, శ్యాం, నరేశ్, గోపి రమేశ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపులు



మలుపు వద్ద ఏపుగా పెరిగిన చెట్లు

- రెండు కిలోమీటర్లకు ఆరు మలుపులు
- రోడ్డుకు ఇరువైపులా పెరిగిన మొక్కలు
- ఎదురురెదురుగా వాహనాలు ఢీకొంటున్న వైనం
- రక్షణ చర్యలకు గ్రామస్తుల వేడుకోలు

లక్ష్మణచాంద: నిర్మల్ నుంచి మండలంలోని వద్యాల్‌తండా గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఆరు మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. కేవలం రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు మార్గంలో మలుపుల వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కన్పించడం లేదు. పలుమార్లు వాహనదారులు ఎదురెదురుగా ఢీకొని గాయపడ్డ సంఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు మలుపుల వద్ద పిచ్చిమొక్కలు తొలగించి రక్షణ చర్యలు చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.



ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకుండా మొక్కలు



రోడ్డు పక్కన పెరిగిన పిచ్చిమొక్కలు

మృతుడి కుటుంబానికి అండ

- ఆర్థికసాయం అందించిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన దూదేకుల షేక్ అహ్మద్ (64) బుధవారం నిర్మల్‌లో జరిగిన రేవంత్‌రెడ్డి సభకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్ణారెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.20 వేలను సాయంగా అందించారు. అలాగే కాంగ్రెస్ నాయకులు అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, అట్ల చిన్న రాంరెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి తమ వంతుగా రూ.50వేలు అందించారు. పలువురు గ్రామస్తులు రూ.3501 పోగు చేశారు. తమకు రూ.73,501 ఆర్థికసాయం అందినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం అంత్యక్రియలు పూర్తయ్యాయి.



పరామర్శిస్తున్న నాయకులు

ఓటు వినియోగంపై ర్యాలీ



రాచాపూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్



కడెంలో ర్యాలీ తీస్తున్న ఐకేపీ సిబ్బంది

సారంగాపూర్: మండలకేంద్రంలో గురువారం ఎంపీడీఓ సరోజ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఓటుహక్కు ప్రాధాన్యత, వినియోగంపై తహసీల్దార్ శ్రీదేవి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ఐకేపీ, అంగన్‌వాడీ సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: ధనం, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని రాచాపూర్‌లో గ్రామస్తులకు ఎస్సై ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ఉల్లంఘనలు జరిగితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఎన్నికల ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారి నాగప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

కడెం: అర్హులు తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఏపీడీ గోవిందరావు అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఐకేపీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఇందులో డీపీఎం శోభ, ఏపీఎం రాజారాం, సిబ్బంది ఉన్నారు.

కుంటాల: ఓటును ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై హన్మాండ్లు అన్నారు. గురువారం మండలంలోని విఠాపూర్ గ్రామంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఆర్‌ఐ అడెల్లు, కార్యదర్శి కవిత, బీఎల్‌వో సురేఖ, ఎఫ్ఏ సుదర్శన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. భైంసా, లోకేశ్వరం దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), కుంటాల మండలాల నుంచి మహిళలు పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు

నిర్మల్‌లో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం పూజారులు భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అన్నదాతలుగా నిలిచిన సాయినిషిత, నిహార, రిత్విక, లక్ష్మీ-ధర్మరాజు, లత-అర్జున్, శిరీష-ప్రణయ్ దంపతులను ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాయిదీక్ష సేవా సమితి సభ్యులు జైపాల్‌రెడ్డి, ఉప్పుల నందు, జిందం గోవర్దన్, సోమేశ్, భూషణ్, చౌదరి, ఆమెడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.



కల్లూర్ ఆలయంలో హారతిలో పాల్గొన్న భక్తులు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

లోకేశ్వరం: ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. గురువారం మండలంలోని బామ్ని(కే), గడ్‌చాంద, నగర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించి మాట్లాడారు. కేంద్రాల వద్ద దివ్యాంగులకు ర్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్, ఏపీవో జగన్నాథ్, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

వసతులు కల్పించాలి

కుంటాల: పోలింగ్ కేంద్రంలో వసతులు కల్పించాలని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని విఠాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్ఐ అడెల్లు, పంచాయతీ కార్యదర్శి కవిత, బీఎల్‌వో సురేఖ, ఉపాధ్యాయులు సాయన్న, భీమన్న పాల్గొన్నారు.



బామ్నికేలో పరిశీలిస్తున్న తహసీల్దార్ మోతీరాం

మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టండి

- నిర్మల్ అభ్యర్థి ఇంద్రకరణ్ రెడ్డి
- తెలంగాణ రాకముందు పల్లెలు ఎట్లుండెనో..ఇప్పుడెట్లున్నయో బేరీజు వేసుకొని ఓటేయాలని విజ్ఞప్తి



నిర్మల్‌రూరల్: కొండాపూర్‌లో ప్రచారం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: జరిగిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని ఆ పార్టీ నిర్మల్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఓటర్లను కోరారు. గురువారం మండలంలోని అక్కాపూర్, కొండాపూర్, భాగ్యనగర్, న్యూ పోచంపాడు, మేడిపల్లి, ఎల్లారెడ్డిపేట్, సీలాయిపేట్, అనంతపేట్ గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. రైతులకు కరెంట్, పెట్టుబడి ఇస్తున్నామని.. తెల్ల రేషన్ కార్డుదారులకు బీమా అందించి, రూ.1కే సన్న బియ్యం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. బీజేపీ మాత్రం తమ మేనిఫెస్టోలో సిలిండర్ ధర తగ్గించకపోవడం శోచనీయమన్నారు. బీడీ కార్మికులకు కట్ ఆఫ్ డేట్ తీసేస్తామని.. దీంతో లబ్ధిదారులందరికీ బీడీ పెన్షన్ వర్తిస్తుందన్నారు. తెలంగాణ రాకముందు పల్లెలు ఎట్లుండే.. ఇప్పుడు ఎట్లున్నాయో బేరీజు వేసుకుని ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, గంగాధర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ప్రచారం..

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన గంగపుత్ర యువజన సంఘం సభ్యులు 40 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, నారాయణ, జహీర్, సిరాజ్, భూమన్న రజనీకాంత్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



బాబాపూర్‌లో మాట్లాడుతున్న సత్యనారాయణ



మామడ: పొన్కల్‌లో నాయకుల ప్రచారం

బీఆర్‌ఎస్‌లో చేరిక

నిర్మల్‌టౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం సారంగాపూర్ మండలం బోరిగాం, బోరిగాంతండా, రాజరాజేశ్వరతండాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సత్యనారాయణగౌడ్, అల్లోల మురళీధర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ఉన్నారు.

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ఎమ్మెల్యేగా ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ హరీశ్‌కుమార్, గంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షేవింగ్ చేసి.. ఓట్లడిగి



షేవింగ్ చేస్తున్న సురేందర్‌రెడ్డి

లక్ష్మణచాంద: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలకేంద్రంలోని ఓ సెలూన్ షాపుకు మంత్రి ఐకేరెడ్డి సోదరుడు అల్లోల సురేందర్‌రెడ్డి వెళ్లారు. అక్కడి వారికి షేవింగ్ చేస్తూ కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, దశరథ్ ఉన్నారు.

నిర్మల్‌లో కాషాయజెండా ఎగరేయాలి

- పదేళ్లలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి ఏది?
- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌రూరల్: నిర్మల్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరవేయాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అక్కపూర్, ముఠాపూర్, కౌట్ల(కె), తాంశ, న్యూముజ్గి, మేడిపల్లి, రత్నాపూర్‌కాండ్లీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మల్ నియోజకవర్గానికి ఏమీ చేయలేదన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన సొంత గ్రామానికి డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసి.. మిగతా గ్రామాలకు మొండిచేయి చూపారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు, బీసీబంధు ఇస్తానని చెప్పి పేదలను మోసం చేశారన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి కేవలం తన కుటుంబానికి మాత్రమే న్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీతోనే రామరాజ్యం సాధ్యమని, యువత, మహిళలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు.



అక్కాపూర్‌లో ప్రచారం చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

'ఏలేటి'గెలవాలని రక్తదానం

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి గెలవాలని మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన 30 మంది యువకులు రక్తదానం చేశారు. లక్ష్మణచాందలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం దానం చేసిన రక్తం యూనిట్లను నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శిబిరానికి మహేశ్వర్‌రెడ్డి సతీమణి కవితారెడ్డి హాజరై యువకులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ, రమేశ్, లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, రాజు, ప్రశాంత్‌రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో రక్తదానం చేస్తున్న యువకులు

'మహేశ్వర్ రెడ్డిని గెలిపించాలి'

లక్ష్మణచాంద: ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఎంపీపీ అడ్వాల పద్మ ఓటర్లను కోరారు. మండల కేంద్రంలోని శ్రీ అష్టభుజ వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సర్పంచ్ ముత్యంరెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అడ్వాల రమేశ్, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ గడ్డం నర్సారెడ్డి, మధుకర్ రెడ్డి భాస్కర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రాజారెడ్డి, రాజు, శ్రీనివాస్, రాజేశ్వర్, గంగాధర్, రంజిత్, గంగాధర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి పనిచేయండి

- ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఖానాపూర్: మూడోసారి కేసీఆర్ సీఎం అయ్యేలా బీఆర్‌ఎస్ కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మస్కాపూర్ గ్రామ సింగిల్‌విండో మాజీ చైర్మన్ దొనికేని చిన్నయ్య గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గజేందర్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు. జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని ఖానాపూర్ పట్టణంలోని ఐదో వార్డులో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పరిమి సురేశ్, ఇర్ఫాన్, సతీశ్, వాసేఖాన్, ఫైసల్, దాము తదితరులున్నారు.



ఖానాపూర్‌లో కండువా కప్పుతున్న జాన్సన్‌నాయక్

నేటి సభకు తరలిరావాలి

ఖానాపూర్: జన్నారంలో శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పాల్గొనే ప్రజాశీర్వాద సభకు కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాజగంగన్న, మున్సిపల్ చైర్మన్ రాజేందర్ పిలుపునిచ్చారు.

రైతులకు బాసటగా బీఆర్‌ఎస్

ఇంద్రవెల్లి: రైతులకు బాసటగా బీఆర్‌ఎస్ నిలుస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. గురువారం మండలంలోని పిప్రి, చిలాటిగూడ, లక్కుగూడ, దేవాపూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఖానాపూర్ అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, నాయకులు భీంరావ్, కోవ రాజేశ్వర్, షేక్ సుఫీయన్, పర్సురాం రాథోడ్, శివాజీ పాల్గొన్నారు.

ఆశీర్వదించి.. కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి

- ఆ పార్టీ నిర్మల్ అభ్యర్థి శ్రీహరిరావు

నిర్మల్: నియోజకవర్గ అభివృద్ధి కోసం తనను ఆశీర్వదించి కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని నిర్మల్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ప్రజలను కోరారు. జిల్లాకేంద్రంలోని తన నివాసంలో వివిధ వార్డులకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు గెలుపు కోసం శ్రమించాలన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామడ: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావ్ అన్నారు. గురువారం మండలంలోని రాంపూర్, గోండుగూడ గ్రామాల్లో కార్నర్ సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందన్నారు. కార్యక్రమంలో రాథోడ్ సంతోష్, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



నిర్మల్‌లో పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

బాధిత కుటుంబానికి చేయూత

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌కు చెందిన శాల జనార్దన్ 40 ఏళ్లుగా అదే గ్రామంలోని శివాజీ బీడీ హెడ్ ఆఫీస్‌లో ప్యాకింగ్ చేస్తూ అనారోగ్యానికి గురయ్యాడు. బుధవారం అతడు మృతి చెందగా.. ఈ విషయాన్ని గ్రామ యువకులు 'మన రాంపూర్' వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయగా పలువురు దాతలు స్పందించారు. ఉద్యోగులు, యువకులు రూ.14,600, జనార్దన్‌తో కలిసి పని చేసిన వారు రూ.ఏడు వేలు జమ చేశారు. గురువారం సభ్యులు సదరు నగదు రూ.21,600ను బాధిత కుటుంబసభ్యులకు అందించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



బాధితులకు నగదు అందిస్తున్న సభ్యులు